# భక్తజన సాగరం

## ఆకట్టుకున్న గణనాథుడి రూపాలు
## నగరం.. నిమజ్జన కోలాహలం
## భక్తజన హోరు.. ట్యాంక్‌బండ్ పరిసరాలు



సిటీబ్యూరో, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): బహుముఖ రూపాలతో గణనాథులు సందడి చేశారు. భక్తుల సృజనకు ప్రతీకగా విభిన్న రూపాలలో నగరంలో కొలువుదీరిన గణపయ్య నిమజ్జనం మంగళవారం కోలాహలంగా సాగింది. తమ ఇష్టదైవాన్ని గంగమ్మ ఒడికి చేర్చేందుకు వివిధ ప్రాంతాల నుంచి జనం భారీ ఊరేగింపుగా కదిలి వచ్చారు. సంగీత వాయిద్యాలు, తీన్మార్ దరువులు.. బూరల శబ్దాలు, యువ కేరింతలతో ఉత్సాహభరిత వాతావరణం ఏర్పడింది. పోతరాజుల వీరంగాలు, శివసత్తుల వేషధారణలో నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలివచ్చే బహురూప వినాయకులను దర్శించుకునేందుకు భక్తులు తరలిరావడంతో హుస్సేన్ సాగర్ తీరం జన సంద్రమైంది. డీజేల సందడి పెద్దగా కనిపించలేదు.

### గణనాథులకు ఘనంగా వీడ్కోలు

నగర వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. ఎల్బీనగర్, చార్మినార్, రామంతాపూర్, ఉప్పల్ తదితర చోట్ల నిమజ్జనానికి తరలిన గణనాథులకు గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వీడ్కోలు పలుకుతూ అడుగడుగునా భక్తులు నీరాజనాలు సమర్పించారు. నగరంలో 60 చోట్ల ఏర్పాటు చేసిన ఉత్సవ సమితి వేదికలపై స్వామీజీలు, ప్రముఖులు పాల్గొని తమ సందేశాలు అందించారు. చార్మినార్, ఎంజే మార్కెట్ వద్ద ఉత్సవ సమితి వేదికలపై కేంద్ర మంత్రి బండి సంజయ్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, స్వామీజీలు ఉజ్జయిని దీపాంకర్, కమలానంద భారతి ప్రసంగించారు. ఎంజే మార్కెట్ వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గణపతులకు సమితి ప్రతినిధులు రాఘవరెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, రావినూతల శశిధర్ తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.

### కిక్కిరిసిన పరిసరాలు..!

విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సెలవు ప్రకటించడంతో నగరవాసులు సకలం కుటుంబ సమేతంగా ట్యాంక్‌బండ్‌కు విచ్చేశారు. ఖైరతాబాద్ మహాగణపతి ఊరేగింపును వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఉదయమే భారీగా జనం తరలొచ్చారు. భక్తులు పలు రకాల వాహనాలు, ఇంకొందరు పల్లకీలలో విగ్రహాలను తీసుకొచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ప్రైవేటు వ్యక్తులు సేవలు అందించారు. నిమజ్జన వేడుకలో సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తాయి. కళాకారులు ఆట, పాటలతో సందడి చేశారు. కోలాటం ఆడుతూ గణపయ్యను గంగ ఒడికి చేర్చారు. నిమజ్జనం సందర్భంగా చాలా మంది తినుబండారాలు విక్రయించే వారికి వ్యాపారం కలిసొచ్చింది. ఫుడ్ స్టాల్స్ గిరాకీతో కళకళలాడాయి. ఇంకొందరూ టాటూ షాపులు ఏర్పాటు చేయడంతో అవి కూడా నిండుకున్నాయి.

### జయహో కేసీఆర్..!

అందరి చూపు.. సచివాలయం, అమరవీరుల స్మారకం, అంబేద్కర్ విగ్రహంపైనే అధికంగా ఉన్నాయి. ఈ నిర్మాణాల ముందు సెల్ఫీలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు. ప్రధానంగా స్మారక స్థూపం అద్దంలా మెరుస్తుండటంతో గణనాథుల యాత్ర, భక్తుల ప్రతిబింబాలు అందులో దర్శనమిస్తున్న దృశ్యాలను మొబైల్‌లో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ మురిసిపోయారు. జయహో కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు.

### గ్రేటర్‌లో 1.02,510 లక్షల విగ్రహాలు నిమజ్జనం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో సాఫీగా నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుందని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. రాత్రి 8 గంటల వరకు 1,02,510 గణనాథుల విగ్రహాల నిమజ్జనం జరిగిందన్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 71 ప్రాంతాలలో నిమజ్జన కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అత్యధికంగా మూసాపేట ఐడీఎల్ చెరువులో 26,546 విగ్రహాలు, ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్‌లో 4,730, నెక్లెస్ రోడ్డు 2,360, పీపుల్స్ ప్లాజా 5,230, అల్వాల్ కొత్త చెరువులో 6,211 విగ్రహాల నిమజ్జనం జరిగిందన్నారు.



ప్రచండ భానుడి వేషధారణలో నిమజ్జనానికి తరలుతున్న విఘ్ననాయకుడు



సింహంపై ఆసీనుడు.. సింహాసనుడు



మహాగణపతిని చూద్దాం.. పదా..: చిన్నారి



నిమజ్జన వేడుకలో ఉత్సాహంతో పాల్గొన్న మహిళా భక్తులు

## విఘ్నేశ్వరా.. వెళ్లిరా...



చార్మినార్ ముందు నుంచి భారీ గణేశ్ శోభాయాత్ర



బుజ్జి గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తురాలు



ట్రై సైకిల్‌పై గణనాథుడిని తరలిస్తున్న చిన్నారి



ద్విచక్ర వాహనంపై బుజ్జి వినాయకుడి తరలింపు..



కొంపల్లిలో రూ.29 లక్షల 10 వేలకు లడ్డూ వేలం

*కొంపల్లి అపర్ణ ఫామ్‌మేడోస్‌లో జరిగిన వేలం పాటలో అదే ప్రాంతానికి చెందిన వెంకట్‌రాంరెడ్డి రూ.29 లక్షల 10 వేలకు లడ్డూ దక్కించుకున్నారు. - కుత్బుల్లాపూర్*

## కీర్తి రిచ్‌మౌండ్ విల్లా లడ్డూ @ రూ.కోటి 87 లక్షలు

- ఆల్ టైం రికార్డ్ క్రియేట్ చేసిన లడ్డూ వేలం
- నగరంలో హోరాహోరీగా వేలం పాట నిర్వహణ
- బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర.. రూ.30లక్షలకు పైనే..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ)/బండ్లగూడ: గ్రేటర్‌లో లంబోదరుడి లడ్డూకి విశేషమైన ఆదరణ వస్తున్నది. ఏటా ఘనంగా నిర్వహించే గణేశ్ ఉత్సవాల్లో ఆనవాయితీగా నిర్వహించే లడ్డూ ప్రసాదాన్ని భక్తులు పోటీ పడి మరీ కొనుగోలు చేస్తున్నారు. గతేడాది కంటే అధిక ధరకైనా లడ్డూను మాత్రం తామే దక్కించుకోవాలన్నట్లుగా వేలం పాటను ఆకాశమెత్తుకు తీసుకెళ్తున్నారు. అలా ఏటా హోరాహోరీగా సాగుతున్న వేలం పాటలతో లడ్డూ ధరలు సరికొత్త రికార్డులను సొంతం చేస్తున్నాయి. ఒకప్పుడూ లడ్డూ వేలానికి బాలాపూర్ గణనాథుడు మాత్రమే కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే పరిస్థితి నుంచి, ఇప్పుడు నగర వ్యాప్తంగా లడ్డూ వేలం పాటలు ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్నాయి. దీంతో ఊహించని రీతిలో లడ్డూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అయితే, ఈసారి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీర్తి రిచ్‌మౌండ్ విల్లాస్‌లో నవరాత్రులు పూజలందుకున్న లడ్డూ కోసం నిర్వహించిన వేలం పాటలో కళ్లు చెదిరే ధరతో సొసైటీ సభ్యులు సొంతం చేసుకున్నారు. రూ.కోటి 87 లక్షలకు సొంతం చేసుకోగా, గతేడాది కంటే రూ.62 లక్షల అధిక ధర పలికింది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగా చూసే బాలాపూర్ లడ్డూ వేలం కూడా సరికొత్త రికార్డును క్రియేట్ చేసింది. ఈ సారి పోటీదారుల సంఖ్య తగ్గినప్పటికీ రూ. గతేడాది కంటే రూ. 3.01 లక్షల అధిక ధరతో రూ. 30.01లక్షలతో బాలాపూర్ స్థానికుడు, కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కొలను శంకర్ రెడ్డి సొంతం చేసుకున్నారు.

## విద్యుత్ సరఫరా తీరుపై సీఎండీ పర్యవేక్షణ

### - నిమజ్జనం వేళ సరఫరాలో అంతరాయం



హుస్సేన్ సాగర్ చుట్టూ విద్యుత్ సరఫరా తీరును పర్యవేక్షిస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): హుస్సేన్ సాగర్ పరిసరాల్లోని ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్ సరఫరా తీరును దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ పర్యవేక్షించారు. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ పి.వెంకన్నతో పాటు క్షేత్ర స్థాయిలోని విద్యుత్ అధికారులతో కలిసి నిమజ్జనం చేసే ప్రదేశాలను ప్రత్యేకంగా పరిశీలించారు.

### పలు చోట్ల సరఫరాలో అంతరాయం

గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో విద్యుత్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసినా, పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. మంగళవారం సాయంత్రం నుంచి అర్థరాత్రి వరకు హుస్సేన్‌సాగర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో నిమజ్జనం జరుగుతున్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానంగా ట్యాంక్ బండ్ ప్రాంతంలో పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి విద్యుత్ సరఫరాను పర్యవేక్షించడంతో వెంటనే పునరుద్ధరణ చేయడంతో నిమజ్జనం కార్యక్రమం సాఫీగా సాగిందని అధికారులు తెలిపారు.



మల్కం చెరువుకు మట్టి గణపతిని తరలిస్తున్న భక్తులు



ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీగా భక్తజన సందోహం



వింటేజ్ వాహనంపై గణేశ్ మహరాజ్..